

టీయూలో పీజీ పరీక్షలకు 91 మంది విద్యార్థుల గైర్హాజరు

డిచ్‌పల్లి, జనవరి 27: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ 3వ సెమిస్టర్ జరిగిన పరీక్షలో 91 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద యం జరిగిన పరీక్షకు 1,699 మంది విద్యార్థులకు 1,609 మంది హాజర య్యారని, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 181 మందికి 180 మంది హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ తెలిపారు.

- మిల్లుల్లో కనిపించని కస్టమ్ మిల్లింగ్ రైస్
- అధికారుల తనిఖీల్లో బయటపడుతున్న కుంభకోణం
- పది మిల్లుల్లోనే వంద కోట్ల వరకు గుర్తించిన అధికారులు
- మిల్లుల యజమానులపై కేసులు
- కొనసాగుతున్న అధికారుల తనిఖీలు



రైస్‌మిల్లుల్లో.. ధాన్యం మాయం!

నిజామాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని కొన్ని రైస్‌మిల్లుల్లో కస్టం మిల్లింగ్ ధాన్యం లేదు. ఏళ్ల తరబడి బకాయిలు పెరుగుతున్నా మిల్లర్లు ముందుకు రావడంలేదు. ఫిర్యాదులు వచ్చినా మిల్లులపై అధికారులు తనిఖీలు చేస్తుంటే విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. ధాన్యంనిల్వలు లేకపోవడంతోపాటు బియ్యం బహిరంగ మార్కెట్‌కు తరలింపు బయటపడుతోంది. ధాన్యం కొనుగోలుకు అనుగుణంగా సీజన్లలో మిల్లర్లకు కేటాయింపులు చేసిన కొంతమంది మిల్లర్లు నిబంధనల ప్రకారం బియ్యం బకాయిలను ఎఫ్‌సీఐకి పెట్టడం లేదు. గడువు ముగిసిన పట్టించుకోవడం లేదు. కొన్ని మిల్లులకు నోటీసులు ఇచ్చి కేటాయింపులు నిలిపివేసిన పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆదేశంతో మిల్లుల్లో తనిఖీలతో భారీఎత్తున ఈ ధాన్యం పక్కదారి బయటపడుతోంది. చివరకు అధికారులు తప్పని పరిస్థితుల్లో మిల్లర్లపై కేసులు నమోదు చేస్తున్నారు. బియ్యం రికవరీ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్యారంటీ లేకుండానే మిల్లులకు ధాన్యం

జిల్లాలో ప్రతీ సీజన్ ధాన్యాన్ని సివిల్ సప్లై కార్పొరేషన్, సివిల్ సప్లై శాఖల ఆధ్వర్యంలో పీఏసీఎస్‌లు, మహిళా గ్రూపులు, మార్కెట్ కమిటీల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ సీజన్‌లో జిల్లాలోని రారా, బాయిల్డ్ మిల్లులకు వాటి కెపాసిటీకి అనుగుణంగా ధాన్యాన్ని కేటాయింపులు చేస్తున్నారు. గడిచిన ఐదేళ్లుగా ప్రతీ సీజన్‌లో 5 లక్షల నుంచి 6 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ఈ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ మిల్లుకు వెయ్యి టన్నుల నుంచి 10 వేల టన్నుల వరకు కేటాయింపులను చేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం గత కొన్నేళ్లుగా అసోసియేషన్ గ్యారంటీపైనే ధాన్యాన్ని మిల్లులకు కేటాయింపులు చేస్తున్నారు. గతంలో లాగా బ్యాంకు గ్యారంటీ లేకుండానే ధాన్యాన్ని మిల్లులకు అప్పచెప్పుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం పట్టడంతోపాటు క్వింటాకు 67కిలోల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టే విధంగా ఒప్పందాలను చేసుకుంటున్నారు. ప్రతీ సీజన్‌లో ఇదే రీతిలో ఒప్పందాలు కొనసాగిస్తున్నారు. దీన్ని ఆసరాగా చేసుకొని జిల్లాలో కొన్ని మిల్లుల యజమానులు, ధాన్యాన్ని పట్టడంతోపాటు బియ్యాన్ని డిమాండ్‌కు అనుగుణంగా ఇతర ప్రాంతాలకు తరలించి అమ్మకాలు చేస్తున్నారు.



2022 నుంచి సక్రమంగా కేటాయింపుల్లేవ్

గడిచిన మూడేళ్లుగా బియ్యం ధరలు పెరుగుతుండటం, సన్నరకం ధాన్యం ఎక్కువగా వస్తుండటంతో మిల్లర్లు ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కొంతమంది మిల్లుల యజమానులు 2022 నుంచి ఎఫ్‌సీఐకి బియ్యం కేటాయింపులు సక్రమంగా చేయడం లేదు. కొంతమొత్తం పెట్టి మిగతావి పంపడం లేదు. అధికారులు ఒత్తిడి తెస్తే బియ్యాన్ని బయటకి పంపడం వల్ల ఇతర మార్గాల ద్వారా సేకరించి పంపిస్తున్నారు. కొంతమంది మిల్లర్లు రేషన్ బియ్యం కూడా కొనుగోలు చేసి మళ్లీ వాటిని కొంతమేర మిల్లులో పట్టి ఎఫ్‌సీఐకి పంపిస్తున్నారు. గతంలో కొన్ని లోన్‌లను ఎఫ్‌సీఐ అధికారులు తిప్పి పంపించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో మిల్లర్లపై దృష్టి పెట్టడంతో భారీఎత్తున బియ్యాన్ని ఇతరరాష్ట్రాల నుంచి తెప్పిస్తున్నారు. బీహార్, మధ్యప్రదేశ్, యూపీ నుంచి తీసుకువస్తున్నారు. గడిచిన నెలరోజుల్లో ఎనిమిది లారీల వరకు పోలీసులు పట్టుకున్నారు. గడిచిన కొన్నేళ్లుగా ప్రభుత్వం పట్టించుకోకపోవడం ధాన్యం కేటాయింపుల్లో రాజకీయ జోక్యం పెరగడంతో అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంతో రూ.కోట్ల ధాన్యం తరలిపోయింది.

వంద కోట్లకు పైగా విలువైన ధాన్యం పక్కదారి

ప్రభుత్వ ఆదేశాలతో గడిచిన కొన్నిరోజులుగా జిల్లాలోని పెండింగ్ మిల్లులపై అధికారులు దృష్టిపెట్టారు. ఆ మిల్లుల్లో ధాన్యాన్ని తనిఖీ చేస్తున్నారు. జిల్లాలో ఈ మిల్లులు ఎక్కువగా ఉండటంతో రోజు కొన్నిట్లో పరిశీలన చేస్తున్నారు. ఇప్పటివరకు పది మిల్లుల్లో తనిఖీ చేపట్టగా సుమారు 100 కోట్లకు పైగా విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. వెంటనే ఆ మిల్లులకు నోటీసులు కూడా జారీ చేశారు. కొన్ని మిల్లులపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు. ఈ మిల్లులకు కేటాయించిన ధాన్యం లేదు. కావాల్సిన బియ్యాన్ని కూడా కేటాయింపులు చేయలేదు. పది మిల్లుల్లోనే ఇంత పెద్దఎత్తున బయట పడటంతో మిగతా మిల్లులపైన అధికారులు దృష్టి పెట్టారు. ఇప్పటివరకు కస్టం మిల్లింగ్ కింద బియ్యాన్ని ఎఫ్‌సీఐకి పెట్టని మిల్లులపై దృష్టిపెట్టి తనిఖీలు చేసేందుకు నిర్ణయించారు.

మిల్లుల్లో అధికారుల తనిఖీలు

పోలీసుల సహకారంతో సివిల్ సప్లై కార్పొరేషన్, శాఖల అధికారులతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ తనిఖీలను చేస్తున్నారు. భారీఎత్తున బయటపడుతుండటంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను నియమించి పెద్దఎత్తున తనిఖీలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో కొంతమంది నేతలు, పెద్ద మిల్లులకు సంబంధించినవి కూడా బకాయిలు ఎక్కువగా ఉండటంతో వాటిపైన దృష్టిపెట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. మిల్లులపై తనిఖీలు ఎక్కువవుతుండటంతో కొంతమంది మిల్లుల యజమానులు అధికార పార్టీ నేతల ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారు. ఒత్తిళ్ల నుంచి బయటపడేందుకు సిద్ధమవుతున్నారు. కొంత సమయం తీసుకొని పెడతామని హామీలిస్తూ ముందుకు పోతున్నారు. కస్టం మిల్లింగ్ కేటాయింపులకు ఈనెలాఖరు వరకే సమయం ఉండటంతో ఆలోపు ఎక్కువ మొత్తంలో బకాయిలు వసూలు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. జిల్లాలో చేపట్టిన ఈ తనిఖీల్లో ఎంత మేరకు బకాయిలు ఉన్న మిల్లులు బయటపడుతాయో తేలే అవకాశం ఉంది.

గ్రామీణ రైతులు, యువతను ప్రోత్సహించేందుకే సదస్సులు

- యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్



స్టాళ్లను పరిశీలిస్తున్న యూఎస్ కాన్సుల్ జనరల్

డిచ్‌పల్లి, జనవరి 27: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులను, నైపుణ్యం గల యువతను ప్రోత్సహించేందుకు డెవలప్‌మెంట్ డైలగ్ - 2024 వంటి సదస్సులు కాకతీయ సాండ్ బాక్స్ నిర్వహించడం అభినందనీయమని అమెరికా కాన్సుల్ జనరల్ (హైదరాబాద్) జెన్నిఫర్ లార్సన్ అన్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని గజవాడ కన్వెన్షన్‌లో కాకతీయ సాంగ్ బాక్స్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగంలో రైతులు నూతన ఆధునాతన వంగడాలను పండిస్తూ ఆదర్శరైతులుగా ఎదగాలన్నారు. అధిక దిగుబడులు సాధించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఏర్పాటుచేసిన పలు రకాలను స్టాళ్లను ఆమె పరిశీలించారు. గతంలో ఇలాంటి సమావేశాలు నగరాల్లో మాత్రమే జరిగేవని, ప్రస్తుతం డిచ్‌పల్లి వంటి ప్రాంతంలో జరగడం శుభసూచికమని పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని వ్యక్తపర్చారు. కార్యక్రమంలో నాబార్డు మాజీ ఛైర్మన్ డా.జీఆర్ చింతల, అంతర్జాతీయ ఆర్థికవేత్త రమణన్ లక్ష్మీనారాయణ, సియెర్రా అట్లాంటిక్ వ్యవస్థాపకుడు మాజీ సీఈవో రాజరెడ్డి, రెడ్‌బస్ సహవ్యవస్థాపకుడు సామ ఫణీంద్ర, వెంకట్, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న పలువురు ప్రముఖ పారిశ్రామిక వేత్తలు



కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థినికి బ్యాడ్జిని అందజేస్తున్న కలెక్టర్

బాలికలు, మహిళలు

స్వీయరక్షణపై దృష్టిపెట్టాలి

- గుడ్‌టచ్ - బ్యాడ్‌టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించాలి: జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

ఖిల్లా, జనవరి 27: ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో బాలికలు, మహిళలు స్వీయరక్షణ పద్ధతులపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా న్యాయాధికారి సునీతకుంచాల, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతులు ఉద్బోధించారు. జిల్లాన్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పోలీసు పరేడ్‌మైదానంలో బాలికలకు, విద్యార్థినులకు స్వీయ ఆత్మరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవితం కష్టసుఖాల సమాహారమని, సమస్యలు ఎదురైనప్పుడు కుంగిపోకుండా ధైర్యంగా నిలబడి వాటిని ఎదుర్కొవాలని సూచించారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఎలాంటి సమస్యనైనా అధిగమించొచ్చని, పోలీసు, జ్యూడీషరీ వంటిఅనేక వ్యవస్థలు మీకు అండగా నిలుస్తాయని అన్నారు. బాలికలు, మహిళలు శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే ఎలాంటి సవాళ్లనైనా ధైర్యంగా ఎదుర్కొగలుగుతారని అన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని, వాటి పట్ల అవగాహన ఏర్పర్చుకోవాలని హితవు పలికారు. ఏదైనా ఘటన జరిగితే తమలోతాము కుమిలిపోకుండా తల్లిదండ్రులు, టీచర్ల దృష్టికి తేవాలని సూచించారు. సంబంధిత చట్టాలను అనుసరిస్తూ బాధిత మహిళలు, బాలికలకు న్యాయం జరిపించేందుకు, నిందితులకు శిక్షపడేలా పోలీసు, న్యాయ వ్యవస్థలు కృషిచేస్తాయని అన్నారు. జిల్లాయంత్రాంగం తోడ్పాటును అందిస్తుందని భరోసా కల్పించారు. బయటకు చెబితే ఏమవుతుందో అనే భయం కారణంగా చాలామంది అవాంఛనీయ ఘటనల గురించి మిన్నకుండిపోతున్నారని, ఇది ఎంతమాత్రం సరైంది కాదని హితవు పలికారు. ఎవరైనా అనుచితంగా, అమర్యాదకరంగా ప్రవర్తిస్తే అలాంటి వారిని ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థినులకు గుడ్‌టచ్-బ్యాడ్‌టచ్ గురించి అవగాహన కల్పిస్తూ వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. స్వీయ రక్షణలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు చెందిన బాలికలకు నెలరోజులపాటు కరాటేలో శిక్షణ ఇవ్వగా వారు ఈ సందర్భంగా అహుల ముందు కరాటే విన్యాసాలను అలవోకగా ప్రదర్శిస్తూ తమ ప్రతిభను చాటారు. ప్రతిభ చాటిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. జీవితంలో ధైర్యంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. బాలికలు, యువతులకు స్వీయ ఆత్మరక్షణ అవసరం అని గుర్తించిన ప్రభుత్వం ఆయా పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసిందని, నెలరోజులపాటు శిక్షణ ఎంతో ఉపయోగంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగేనేవార్, అదనపు కలెక్టర్ చిత్రమిశ్రా, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ ఐపీఎస్ చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి దుర్గాప్రసాద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు రాజేందర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవిదాస్ చాండక్, జీసీడీవో లలిత, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కరాటే చేసి చూపుతున్న విద్యార్థిని

పోలీసు అధికారుల బదిలీలు షురూ!

- కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు
- ఉమ్మడి జిల్లా పరిధిలో భారీగా సీఐల బదిలీలు
- ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి జిల్లాకు బదిలీపైన వస్తున్న అధికారులు
- బదిలీల్లో పనిచేసిన నేతల సిఫారసులు



నిజామాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మల్టీజోన్ పరిధిలో భారీగా సీఐల బదిలీలను చేపట్టారు. దీంతో ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న చాలామంది సీఐలను బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీజోన్-1 పరిధి ఐజీ ఉత్తర్వులను జారీచేశారు. బదిలీ అయిన వారిని వెంటనే సంబంధిత స్టేషన్‌లో చేరాలని ఆదేశాలి చ్చారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందుగానే అధికారులను బదిలీ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో ముందస్తుగా వీరిని బదిలీ చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న వారిలో కొంతమందిని బదిలీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో కొంతమంది నేతలకు దగ్గరగా పనిచేసిన సీఐలను ఇతర ప్రాంతాలకు బదిలీచేశారు. మరికొంత మందిని ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని కోరారు. మల్టీజోన్ పరిధిలో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను ఉమ్మడి జిల్లాల్లో కేటాయింపులను చేశారు. ఈ బదిలీల్లో కొన్నిచోట్ల అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు ఇచ్చిన సిఫారసులకు అనుగుణంగానే పోస్టింగ్‌లు దక్కినట్లుతెలుస్తోంది. ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పడటం గత ప్రభుత్వంలో కొంత అనుకూలం గా పనిచేసిన అధికారులను లూప్‌లైన్‌కు పంపించారు. నేతలకు అనుకూలంగా ఉన్న అధికారులకు ఈ దఫా పోస్టింగ్‌లను ఉమ్మడి జిల్లా పరిధిలో కేటాయింపులను చేశారు. లూప్‌లైన్‌లో పనిచేసిన అధికారులకు కూడా కీలకమైన సర్కిల్‌లో అవకాశాలను కల్పిస్తూ పోస్టింగ్‌లు ఇచ్చారు.

ఉమ్మడి జిల్లా పరిధిలో భారీగా బదిలీలు

నిజామాబాద్‌లో సీఎస్‌బీ-3గా పనిచేస్తున్న శ్రీనివాస్‌ను మల్టీజోన్-1 ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిజామాబాద్ ట్రాఫిక్ సీఐగా ఉన్న చందర్ రాథోడ్‌ను సీఎస్‌బీ-3గా నియమించారు. ఐజీ కార్యాలయం ఆటాచ్‌గాఉన్న ఎ.వెంకటేశ్వర్లను సీఎస్‌బీ-2గా నియమించారు. అక్కడున్న ముత్యాలును బదిలీ చేశారు. ఆయనను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సిద్దిపేట టూటౌన్ ఎస్‌హెచ్‌వోగా ఉన్న వి.రవికుమార్‌ను ఆర్మూర్ టౌన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఆర్మూర్‌లో పనిచేస్తున్న డి.సురేష్‌బాబును ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని కోరారు. సిద్దిపేట సీఎస్‌బీ-3గా ఉన్న పి.సురేందర్‌ను ధర్పల్లి సీఐగా నియమించారు. నిర్మల్ సీసీఎస్ సీఐగా ఉన్న మల్లేష్ నుంచి డిచ్‌పల్లి సీఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న కృష్ణను ఐజీ కార్యాలయానికి బదిలీచేశారు. బోధన్ ఎస్‌హెచ్‌వో బీడీ ప్రేమ్‌కుమార్‌ను సీసీఎస్-3 నిజామాబాద్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న వీరయ్యను బోధన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. బోధన్‌రూరల్ సర్కిల్ సీఐ జి.శ్రీనివాస్‌రాజును నిజామాబాద్ సీసీఆర్‌బీ సీఐగా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న మనోజ్‌కుమార్‌ను బదిలీచేశారు. జైనాథ్ రూరల్ సీఐ కోలా నరేష్‌ను బోధన్ రూరల్ సీఐగా నియమించారు. సీసీఆర్‌బీ సీఐగా పనిచేసిన మనోజ్‌కుమార్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. డీసీఆర్‌బీ కామారెడ్డి సీఐగా ఉన్న కె.శ్రీధర్‌రెడ్డిని ఆర్మూర్ రూరల్ సీఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న గోవర్ధన్‌రెడ్డిని ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిజామాబాద్ సీసీఎస్-2 సీఐ వి.సురేందర్ రెడ్డి, పీసీఆర్ నిజామాబాద్ సీఐ వెంకటయ్యను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కామారెడ్డి ఎస్‌బీ-2 గా పనిచేస్తున్న బి.సంతోష్‌కుమార్‌ను సదాశివనగర్ సర్కిల్ సీఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న రమణ్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఎస్‌బీ నిర్మల్ సీఐగా ఉన్న బి.రవీందర్‌నాయక్‌ను ఎల్లారెడ్డి సీఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న నేమాని శ్రీనివాస్‌ను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలిచ్చారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ సీఐగా పనిచేస్తున్న జగడం నరేష్‌ను బిచ్కుంద సీఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న రెడ్డబోయిన కృష్ణను ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు.

పుష్కరఘాట్ వద్ద వసతులు కరువు

- అభివృద్ధికి నోచుకోని తడపాకల్ పుణ్యక్షేత్రం
- వసతులు లేక భక్తులకు ఇబ్బందులు
- అభివృద్ధి పేరుతో డబ్బులు వసూలు



మహిళల కోసం ఏర్పాటు చేసిన గదులు ఇలా..

ఏర్గట్ల, జనవరి 27: పవిత్ర గోదావరి నది పుష్కర పుణ్యక్షేత్రమైన తడపాకల్ పుష్కరఘాట్ వద్ద కనీస వసతులు లేక అక్కడకి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురవుతున్నారు. గోదావరి నది వద్ద రెండు పర్యాయాలు జరిగిన గోదావరి పుష్కరాల్లో ఊహించని స్థాయిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆ సమయంలో తడపాకల్ అనునిత్యం లక్షకుపైగా భక్తులు తరలివచ్చారు. ఈ ప్రాంత ప్రజలేగాక దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ప్రతీ మొక్కును గోదావరి వద్ద చెల్లించుకుంటారు. ఇప్పటికీ ప్రతి శుక్ర, సోమవారాల్లో వందలాది మంది భక్తులు మొక్కులు తీర్చుకోవడం కోసం వస్తుంటారు. అయితే ఇక్కడికి వచ్చే భక్తులకు మాత్రం మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, శార్థమంటపాలు, తాగునీటి వ్యవస్థ, దుస్తులు మార్చుకొనే గదులు ఆనవాలు లేకుండా పోయాయి. ఘాట్‌లకు ఇరువైపులా ఇనుపరాడ్‌లతో ఏర్పాటుచేశారు. కానీ అవేవీ ఇప్పుడు కనిపించడంలేదు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నీ నామరూపాలు లేకుండా పోవడమే కాక గదుల్లో చెత్తాచెదారంతో నిండిపోయాయి. తాగడానికి కనీసం నీటి సౌకర్యం లేదు. అభివృద్ధి పేరిట గ్రామంలోని కొందరు చిరువ్యాపారస్థుల వద్ద, వాహనదారుల వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. పుష్కరఘాట్ వద్ద భక్తులకు కనీసం సౌకర్యాలు గుర్తించి ఏర్పాట్లుచేస్తే భక్తుల ఇబ్బందులు తొలగిపోతాయని ఇక్కడికి వచ్చే భక్తులు కోరుతున్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిలర్లు

‘చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నెగ్గింది’

పెర్కిట్, జనవరి 27: మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టుగా ఆర్డీవో వినోద్‌కుమార్ ప్రకటించారని వైస్ చైర్మన్ షేక్‌మున్ను, కౌన్సిలర్‌లు తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జనవరి 4న మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై సమావేశం నిర్వహించగా.. 24మంది కౌన్సిలర్‌లు అవిశ్వాసం తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీతపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టుగా ఆర్డీవో ప్రకటించారని, అదేరోజు ప్రొసిడింగ్ కలెక్టర్‌కు పంపామని తెలిపారు. మాజీ చైర్‌పర్సన్ అనుచరుల అవినీతి అక్రమాలు బయటపడతాయని భయపడి అధికార పార్టీ మద్దతు తీసుకున్న విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. ప్రజలు, కౌన్సిలర్‌లు, బీఆర్ఎస్, బీజేపీలు తిరస్కరించిన వారికి అధికార పార్టీ మద్దతు తెలపడం హాస్యాస్పదం అన్నారు. ఇందులో ఆకుల రాము, గంగామోహన్‌చక్రు, సుంకరి రంగన్న, అయ్యప్ప శ్రీనివాస్, రమేష్, లిక్కి శంకర్, ఇట్టెడి నర్సారెడ్డి, జహీర్‌అలీ, ఖాందేశ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో: సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

పెద్దబజార్, జనవరి 27: గణతంత్ర దినోత్సవం రోజున కేటీఆర్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అభ్యంతర కరమైన పదాలను సరి కాదని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు మద్దతు తెలిపిందని ప్రజలు కూడా ఈ ఎన్నికల్లో మార్పు కోరుకొని నియంత పాలనను అంతమొందించిందని అన్నారు. కాంగ్రెస్ అధికారం తెచ్చి సుమారు 50 రోజులే అవుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై నోటికచ్చినట్లు మాట్లాడటం సరికాదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు రఘురాం, అంజల, రాధా, కుమార్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

'పీఆర్‌సీ నివేదిక ప్రకారం కార్మికులకు 30 శాతం సెటిల్‌మెంట్ ఇవ్వాలి'


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ధర్పల్లి, జనవరి 27: జీవో నంబర్ 60 ప్రకారం 2021 పీఆర్‌సీ నివేదిక ప్రకారం అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు 30శాతం సెటిల్‌మెంట్ ఇవ్వాలని ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి ఈనెల 28న వనపర్తిలో జరిగే గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలో మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న నైపుణ్యం కలిగిన వారికి రూ.24500, పారిశుద్ధ్య కార్మికులకు రూ.20100, 18వేల వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలో జీవో 60 ప్రకారం రూ.9500 ఇస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మహాసభలకు రాష్ట్ర నాయకులు అరుణ్‌కుమార్, రంగారావు, సూర్యం, పద్మ హాజరవుతున్నారని జిల్లాలోని నలుమూలాల నుంచి పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దామోదర్, సాయిరెడ్డి, రమేష్, రవి, తదితరులు పాల్గొన్నారు.

30న జక్రాన్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం

జక్రాన్‌పల్లి, జనవరి27: జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బ్రహ్మానందం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 30న ఉదయం 1.30గంటలకు ఎంపీపీ కుంచాల విమల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

'పదో తరగతి పరీక్షలంటే భయపడొద్దు'


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం

బోధన్ రూరల్, జనవరి 27: పదో తరగతి పరీక్షలంటే విద్యార్థులు భయపడవద్దని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే ఉత్తీర్ణత లభిస్తోందని లయోలా హైస్కూల్ కరస్పాండెంట్‌లు శ్యామ్‌సుందర్, ప్రధానోపాధ్యాయులు సురేష్‌లు అన్నారు.బోధన్ పట్టణంలోని లయోలా స్కూల్‌లో శనివారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందరంగా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పరీక్షలంటే భయపడొద్దని, ప్రణాళిక బద్ధంగా చదివితే అన్ని సబ్జెక్టులలో 10/10 మార్కులు సాధించవచ్చన్నారు. పదో తరగతి విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానం


మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

నిజామాబాద్‌అర్బన్, జనవరి 27: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు మాజీ ఎంపీ వి.హన్మంత్‌రావును సైతం జిల్లా బీసీసంఘాల నాయకులు సన్మానించారు.హైదరాబాద్‌లోని ఫతే మైదాన్ క్లబ్‌లో నిర్వహించిన ఈకార్యక్రమంలోమాజీఎమ్మెల్సీ ఆకుల లలిత, బీసీ సంఘ ఐక్యవేదిక నాయకుడు ఆకుల రాఘవేందర్, బొబ్బిలి నర్సయ్య, నాగరాజు, మురళి, రేవంత్, కరిపి గణేష్, శివకుమార్, రతన్, తదితరులు పాల్గొన్నారు. ఐక్యవేదిక కార్యక్రమంలో జిల్లాకు చెందిన బీసీ నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఒక్క బీసీకి కూడా అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వనందున మహేష్‌కుమార్‌గౌడ్‌కు మంత్రి పదవి ఇచ్చి బీసీలకు న్యాయం చేయాలన్నారు. త్వరలో జరుగనున్న బీసీ చైతన్య సదస్సుకు రావాలని వారిని ఆహ్వానించారు.

మందర్నలో సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభం

సాలూర, జనవరి 27: సాలూర మండలంలోని మందర్న గ్రామంలో శనివారం సీసీ డ్రైనేజీ పనులను సర్పంచ్ రావుబా గంగాధర్, ఎంపీటీసీ శివకుమార్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల ద్వారా రెండు లక్షల రూపాయలతో మందర్న గ్రామంలో ఎస్సీ కాలనీల్లో సీసీ డ్రైనేజీ పనులు చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరు చేసిన నిధులతో హున్సా, మందర్న గ్రామాల్లో పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామాల్లో సీసీ డ్రైనేజీ పనులకు మండల పరిషత్ ద్వారా నిధులు మంజూరు చేసిన ఎంపీపీ బుద్దె సావిత్రి రాజేశ్వర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలోవార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.


సీసీ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

పెద్ద కొడప్‌గల్, జనవరి 27: మండలంలో పనిచేసే ఉద్యోగులు ప్రజలకు జవాబుదారిగా ఉండాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మికాంత్ రావ్ పేర్కొన్నారు. శనివారం పెద్ద కొడప్‌గల్ మండల సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై సభను ఉద్దేశించి మాట్లాడారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..మండలంలోని ఆయా శాఖలలో పనిచేసే ఉద్యోగుల పనితీరు సరిగ్గా లేదని అటువంటి వారందరూ తమ ప్రవర్తను మార్చుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు ఉద్యోగులు ఎలా ఉన్న తనకు అవసరం లేదని, ఇక నుంచి వారు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. ఈ సమావేశానికి కొంత మంది అధికారులు తమతమ శాఖలకు సంబంధించిన నివేదికలు లేకుండా వచ్చారని,మళ్లీఇలాంటి పునరావృత్తం కాకుండా సమావేశానికి అధికారులు నివేదికలతో రావాలని సూచించారు. అంతకు ముందు తొలిసారి మండలసర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యేతోట రాగా ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి ఎమ్మెల్యేకు సాదరంగా స్వాగతం పలికి సన్మానించారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంపీపీ ప్రతాప్ రెడ్డి

● శాఖల పనితీరుపై ఎమ్మెల్యే అసంతృప్తి

సమావేశం ప్రారంభం కాగానే ఆయా శాఖలకు చెందిన అధికారులు తమ శాఖ నివేదికలు చదువుతుంటే వాటిని విన్న ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా మండలంలో విద్యాశాఖ పనితీరు బాగా లేదని ఇన్‌చార్జి ఎంఈవో దేవిసింగ్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని మారుమూల గ్రామాలు, తండాలలో పనిచేసే ఉపాధ్యాయులు పనితీరు సరిగ్గా లేదని, ఆపాఠశాలలను ఎందుకు పర్యవేక్షించడం లేదని ప్రశ్నించారు. ఇంక ఉపాధ్యాయులు కొంత మంది మద్యం తాగి పాఠశాలలకు హాజరు అవుతున్నారని, అటువంటి వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రానున్న రోజులలో విద్యాశాఖ పరిస్థితిలో మార్పు రావాలని సూచించారు. దీంతో పాటుగానే మిషన్ భగీరథ నీరు గ్రామాలకు సక్రమంగా అందడం లేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకరావడంతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తవ పరిస్థితి మార్చుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ అధికారులు కూడ రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని తెలిపారు. ఇక పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రం నుంచి కామారెడ్డి జిల్లా కేంద్రానికి బస్సు సౌకర్యం లేదని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో ఈ విషయం కామారెడ్డి డీఎంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో సిబ్బంది కొరత ఉండ టంతో పనులు సరిగ్గా జరగడం లేదని సభ్యులు తెలపడంతో సమస్య పరిష్కరించాలని ఎంపీడీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి,ఎంపీడీవోరాణి, తహసీల్దార్ దశరథం, ఎంపీవో సూర్యకాంత్, జడ్పీటీసీ చంద్రభాగ, సహకారసంఘం అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు జాఫర్, వివిధ గ్రామాలకు చెందిన ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి


క్యాలండర్ ఆవిష్కరిస్తున్న నాన్ టీచింగ్ సిబ్బంది, ఐఎఫ్‌టీయూ నాయకులు

డిచ్‌పల్లి, జనవరి 27: కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్ ను వెంటనే ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో కేజీబీవీ సిబ్బంది నిరసన ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. కేజీబీవీల్లో గత కొన్నేళ్లు గా పనిచేస్తున్న నాన్ టీచింగ్ సిబ్బందికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం లేదని ఆరోగ్య భద్రత కరువైందని వెంటనే వాటిని ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీల్లోపని చేస్తున్న సిబ్బందికి పనిభారం పెరిగిం దని నూతన నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కుక్, స్వీపర్, అటెండర్, స్కావెంజర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలేని కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపామని, రేవంత్‌రెడ్డి నాయకత్వంలో హామీలను అమలు చేయాలని లేనిచే డిమాండ్ల సాధనకు యూనియన్ నాయకత్వంలో పోరాడుతమన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది సుజాత, కరుణశ్రీ, విజయ, పద్మ, మంజుల, పార్వతమ్మ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ప్రగతిశీల కేజీబీవి, నాన్ టీచింగ్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయు) ఆధ్వర్యంలో శనివారం ఆర్మూర్ కేజీబీవీలో క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేజీబీవీలో పని చేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్స్‌కు కనీస వేతనం అమలు కావడంలేదన్నారు. వీరికి పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్‌లాంటి సౌకర్యాలు కల్పించి ఉద్యోగ భద్రత పై భరోసా ఇవ్వాలన్నారు. కనీస వేతనాలు అమలు కాకపోవడంతో సమగ్ర దోపిడికి గురవుతున్నారన్నారు. పనిభారం పెరిగిన ఖాళీలు భర్తీ చేయడంలేదని, పాఠశాలలను ఇంటర్ కాలేజీలుగా అప్‌గ్రేట్ అయిన కేజీబీవీలో పనిభారం మరింత పెరిగిందన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ సిబ్బంది సుమలత, రాధ, అనిత, శోభ, సునీత, రూప, విక్టోరియా, లక్ష్మీ, జయమ్మ, అనసూయ పాల్గొన్నారు.

మునిపల్లి పాఠశాలకు డెస్క్ బెంచీలు అందజేత


డెస్క్ బెంచీలను అందజేస్తున్న దాత ఎస్సై రావుట్ల ప్రేమ్‌సాగర్

జక్రాన్‌పల్లి, జనవరి27: మండలంలోని మునిపల్లి గ్రామంలో గల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు చదువుకోవడానికి దాత ఎస్సై రావుట్ల ప్రేమ్‌సాగర్ డెస్క్ బెంచీలను అందజేశారు. శనివారం పాఠశాలకు ఏడు డెస్క్ బెంచీలను ఎస్సై ప్రేమ్‌సాగర్ పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.చిన్న సాయిరెడ్డి, ఉపసర్పంచ్ సాయన్న, గ్రామస్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● తొర్లికొండలో విద్యార్థులకు ప్లేట్ల వితరణ

మండలంలోని తొర్లికొండ గ్రామంలో హైస్కూల్‌లో శనివారం విద్యార్థులకు అన్నం తినే ప్లేట్లు దాత చిట్యాల శేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జంగం అశోక్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం ఏర్పాటు

ధర్పల్లి, జనవరి 27: ధర్పల్లి, సీతాయిపేట్ పద్మశాలి సంఘం కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పాము నారాయణ, ప్రధానకార్యదర్శిగా క్యాదరి నారాయణ, కోశాధికారిగా అంకం ఆనంద్, ఉపాధ్యక్షుడిగా దువ్వ భూమేష్, కార్యదర్శిగా ఇంజపురం మహేందర్, సభ్యులను ఎన్నుకున్నారు. కాగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, కోశాధికారులకు ఓటింగ్ నిర్వహించారు. సంఘ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఎన్నికైన కార్యవర్గం సభ్యులు తెలిపారు.

జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు కలిగోట్ విద్యార్థిని ఎంపిక

జక్రాన్‌పల్లి, జనవరి27: జాతీయస్థాయి అండర్-19 వాలీబాల్ పోటీలకు మండలం లోని కలిగోట్ గ్రామానికి చెందిన భవ్యశ్రీ ఎంపికైనట్టు వ్యాయమ ఉపాధ్యాయుడు యాదగిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని నెహ్రూ స్టేడియం శివమొగ్గ జిల్లాలో ఈనెల 29నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటున్నట్టు తెలి పారు. ఈ సందర్భంగా భవ్యశ్రీని సర్పంచ్ చేతనరెడ్డి, ఉపసర్పంచ్ రాజు, ఎంపీటీసీ జయ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో ప్రారంభమైన అడ్మిషన్లు

పెర్కిట్, జనవరి27:ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల బాలికల పాఠ శాల, కళాశాలలో 2024-25 విద్యసంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరానికి అడ్మిషన్‌లు పొదలయ్యాయని ప్రిన్సిపాల్ నహీదఫిర్దోస్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీలలో అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అదే విధంగా అడ్మిషన్‌ల అవగాహన కొరకు శనివారం విద్యార్థులు ర్యాలీ నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

మోపాల్, జనవరి 27 :మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ గ్రామానికి చెందిన వినోద్ (29) శనివారం ఇంట్లో ఆత్మహత్య చేసుకోవడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ కలహాల వల్ల వినోద్ ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కమ్మర్‌పల్లిలో వాల్వు గుంత పూడ్చివేత



వాల్వు గుంత (నిన్న) మొరంతో నింపిన వాల్వు గుంత (నేడు)

కమ్మర్‌పల్లి, జనవరి 27: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలోని జాతీయ రహదారిపక్కన ప్రమాదకరంగా మారిన మిషన్ భగీరథ, ఫిల్టర్ వాటర్ పైప్‌లైన్ వాల్వుగుంతలను సంభందితశాఖ అధికారులు ఎట్టకేలకు పూడ్చివేశారు. జాతీయరహదారిపై ప్రమాద ఘంటికలు అన్నశీర్శికన ఈ నెల 8 న ఆంధ్రజ్యోతి లో వచ్చిన కథనానికి స్పందించిన అధికారుల ఆమర్నాడే వాల్వు గుంతలను రేడియం స్టిక్కర్‌లు అతికించారు. గత రెండు రోజుల క్రితం వాల్వు గుంతలను వల్లిలతోట కప్పివేశారు. దీంతో ప్రయానికులు హర్ష వ్యక్తం చేస్తు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

యువతలో మార్పు రావాలి

● పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి రవీందర్


సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

మోపాల్, జనవరి 27: నేటి సమాజంలో యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని వారిలో మార్పు వచ్చే విధంగా పీవైఎల్ బాధ్యత తీసుకోవాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర కోశాధికారి వాల్గోట్ రవీందర్ సూచించారు. మోపాల్ మండల కేంద్రంలో ప్రగతిశీల యువజన సంఘం నిజామాబాద్ డివిజన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి వాల్గోట్ రవీందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో కుల, మత ఉన్మాదుల్లో యువత బలైపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పెడదారి పడుతున్న యువతను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పెరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు, దోపిడి, పీడతనాలను ఎదిరింపజేసి సమసమాజంవైపు యువతను సమీకరించాలని అన్నారు. అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, ఆజాద్ చంద్రశేఖర్, వేములపల్లి కిరణ్‌కుమార్ ఆశయబాటలో యువత నడుచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా కార్యదర్శి నవీన్, డివిజన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'మహాసభలను విజయవంతం చేయండి'


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు

సిరికొండ జనవరి 27: వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగే ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ కార్మికులను కోరారు. మహాసభలకు సంబందించిన గోడ ప్రతులను రావుట్ల గ్రామంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దామోదర్,సాయరెడ్డి,రమేష్,రవి,నర్సయ్య,లక్ష్మి, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై ఇంటింటి సర్వే


కోటగిరిలో సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోటగిరి, జనవరి 27: కోటగిరి ఉమ్మడి మండలంలోని పలు గ్రామాల్లో శనివారం చిన్న చిన్న ఆరోగ్య సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. దగ్గు, జలుబు,జ్వరం ఉన్న వెంటనే ఆసుపత్రికి వచ్చి చికిత్స తీసుకో వాలని సూచించారు. చిన్న పిల్లలు, శిశు మరణాలు తగ్గించేందుకు ప్రభు త్వం ప్రత్యేక కృషి చేస్తుందని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. ఈ విషయమై గ్రామాల్లో అవగాహన కల్పిస్తూ సర్వే నిర్వ హిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రోజా, మంజుల, ఆశాకార్యకర్తలు అనురాధ, గంగామణి తదితరులు పాల్గొన్నారు.

తొర్లికొండలో వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు


తొర్లికొండలో ఆలయ నిర్మాణానికి విరాళలు అందజేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, జనవరి27: మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టు ప్రదక్షిణ చేశారు. ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. నూతనంగా నిర్మించినున్న వెంకటేశ్వరస్వామి నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వీడీసభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నవీపేటలో బైక్ చోరీ


నవీపేటలో బైక్‌ను ఎత్తుకెళుతున్న గుర్తు తెలియని వ్యక్తి

నవీపేట, జనవరి 27: నవీపేటలో శనివారం బైక్ చోరికి గురైంది. బో ధన్‌లోని హనుమాన్ టెకిడికి చెందిన బి.రాజశేఖర్ శనివారం నవీపేటలో జరిగే మేకల సంతలో మేకలను కొనుగోలు చేయడానికి వచ్చాడు. నెహ్రూరోడ్డులోని ఒక బట్టల షాప్ ఎదురుగా తన ఫ్యాషన్ ప్రో బైక్‌ను నిలిపి ఉంచి సంతలోకి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి బైక్ మాయమైంది. ఈ విషయంపై బాధితుడు నవీపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అక్కడే ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా గుర్తు తెలియని మాస్కు ధరించి వ్యక్తి బైక్‌ను ఎత్తుకెళుతున్నట్లు సీసీ కెమెరాలో నమోదైంది. పదిహేను రోజుల క్రితం జక్రాన్‌పల్లికి చెందిన వ్యక్తి బైక్ సైతం మేకల సంతకు వచ్చి తన బైక్‌ను పొగొట్టుకున్నాడు. నవీపేటలో జరిగే మేకల సంతలో తరచుగా బైక్‌లు చోరీకి గురవుతున్నాయని, వెంటనే నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

ముప్కాల్, జనవరి27: ఎస్సారెస్పీ వరదకాలువలో రెండు రోజుల క్రితం గల్లంతైన గడ్డం సాయన్న(58) మృతదేహం లభ్యమైనట్టు బాల్కొండ ఎస్సై గోపి తెలిపారు. ఈనెల 25 బోదేపల్లి శివారులో వరదకాలువలో కరెంటు మోటర్ బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటి విడుదల నిలిపివేశారు. శనివారం మోర్తాడ్ శివారు వరదకాలువలో గడ్డం సాయన్న మృతదేహం లభ్యం కావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, జనవరి27: పట్టణానికి చెందిన దస్‌పాల్ సంతోష్ కుమార్(45) వ్యాపారంలో నష్టపోయి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనెల 24న పనిమీద వెళ్తున్నానని ఇంటి నుంచి బయలుదేరిన ఆయన తిరిగి రాకపోవడంతో శుక్రవారం భార్య శ్రీప్రియ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. శనివారం పట్టణంలోని గూండ్ల చెరువులో సంతోష్ కుమార్ మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందిం చడంతో సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : మున్సిపల్ కమిషనర్

బోధన్ రూరల్, జనవరి 27: క్రీడలు మానసికంగా ఉల్లాసానికి దోహదం చేస్తాయని బోధన్ మున్సిపల్ కమి షనర్ ఖమర్ అహ్మద్ అన్నారు. శనివారం బోధన్ పట్టణంలోని రాకాసి పేట్‌లో క్రికెట్ టోర్న మెంట్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా యువ కులతో కరచలనంతో పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు నగదు బహు మతులు అందజేయబడుతా యన్నారు.సుమారు 40 మంది క్రికెట్ టీమ్‌లు ఈ పోటీల్లో పాల్గొం టున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రీమి యర్ లీగ్ నిర్వాహకులు సయ్యద్ మౌలానా, అబ్దుల్ జబ్బార్, చింటు, సూర్య, అమేర్, హజర్, హర్షత్, పవన్, మెహరజ్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

కుల బహిష్కరణ చేసిన 11 మందిపై కేసు నమోదు

ఖిల్లా, జనవరి 27: తనపై కుల బహిష్కరణ విధించిన 11 మందిపై నగరంలోని నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఈగసంజీవ్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు. ఎలాంటి కార్యక్రమాలకు గతంలో బహిష్కరణ చేసిన విధంగా ప్రవర్తిస్తున్నారని కుల బహిష్కరణ ఎత్తివేయడానికి లక్షా 50వేల జరిమానా కట్టమని బెదిరిస్తున్నారని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'టీయూకి ప్రభుత్వం రూ.200కోట్లు కేటాయించాలి'



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

డిచ్‌పల్లి, జనవరి 27: తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో రూ.200కోట్లు కేటాయించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ యూనివర్సిటీ ఓల్డ్ బాయ్స్ హాస్టల్‌లో పీడీఎస్‌యూ వర్సిటీ కమిటీ నాయకులు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ..వర్సిటీలో విద్యార్థినులకు హాస్టల్ ఇరుకుగా మారి ఇబ్బందులు పడుతున్నారని, నూతన హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆడిటోరియం, స్పోర్ట్స్ మినీ స్టేడియం నిర్మించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంజ నీరింగ్ కోర్సును ప్రవేశ పెట్టాలని డిమాండ్ చేశారు. ఖాళీగా అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని, రెండో కేటగిరి పీహెచ్‌డీ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు అక్షయ్, ఆకాశ్,హన్మండ్లు, శివసాయి, సాయి, ప్రకాశ్ పాల్గొన్నారు.

'బడీడు పిల్లలు బడిలో ఉండాలి'


బడి ఈడు పిల్లలను బడిలో చేర్పిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,జనవరి 27: బడి ఈడు పిల్లలు బడులలో ఉండాలని సీఆర్‌పీ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం బోధన్ మండలంలోని సంగం గ్రామంలో బడి బయట పిల్లల సర్వే నిర్వహించారు. బడి రాని పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించారు. ఈనెల 31వ తేది వరకు బడి బయట పిల్లల సర్వే జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కానిస్టేబుల్ గిరిధర్, ఉపాధ్యాయురాలు శ్రీ లక్ష్మీ, ఉషా, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

'పొతంగల్‌లో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి'


పొతంగల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కోటగిరి, జనవరి 27: పొతంగల్ మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ విషయమై పొతంగల్ తహసీల్దార్ రమేష్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు ఆధార్‌లింకు తప్పనిసరి కావాల్సి ఉంది. ప్రజల ఆధార్‌లింకు కొరకు కోటగిరి, బోధన్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొని ఉందన్నారు. మండల కేంద్రంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భజరంగ్, సతీష్ మహారాజ్ తదితరులు ఉన్నారు.

కల్లూరులో ఉచిత పశువైద్య శిబిరం

కోటగిరి, జనవరి 27: పొతంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో శనివారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ లక్ష్మీ ప్రారంభించారు. ఈ శిబిరంలో 12 పశువులకు గర్భనిర్ధారణ , 10 పశువులకు గర్భకోశ చికిత్సలు, 35 పశువులకు సాధారణ చికిత్సలు, 40 దూడలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి,పశువైద్యులు సురేష్ కుమార్, వైద్య సిబ్బంది రాజేందర్, ప్రకాష్, అభిషేక్,సుధీర్‌గౌడ్, నాయకులు లింగప్ప, వెంకట్‌రెడ్డి, గోపాలమిత్రులు రియాజ్, సాయిలు, నగేష్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈవో

నిజామాబాద్‌అర్బన్, జనవరి 27: అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఈవో దుర్గాప్రసాద్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూదేశంలో విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా విద్యా ప్రైవేటీకరణ జరుగుతుందని నూతన జాతీయ విద్యావిధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అంజలి, రఘురాం, నవీన్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చక్కగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలి

● జాతీయ బాలిక దినోత్సవంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్, జనవరి 27: చక్కగా చదువుకొని బాలికలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జాతీయ బాలికల దినోత్సవం వేడుకలను స్త్రీశిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. బేటీ బచావో - బేటీ పడావో నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో తమదైన శైలిలో రాణిస్తూ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. ఇదివరకటితో పోలిస్తే పరిస్థితుల్లో చాలావరకు మార్పు వచ్చిందని చదువుతో పాటు క్రమశిక్షణలోనూ బాలికలదే పైచేయిగా నిలుస్తుందన్నారు. ప్రతి ఒక్కరి జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని చదువుతో పాటు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని అంకితభావంతో ఆ దిశగా కృషి చేస్తు గమ్యానికి చేరాలని అన్నారు. బాలికల పట్ల తల్లిదండ్రులు సైతం వివక్షను చూపవద్దని ఉన్నత విద్య కోసం వారిని ప్రోత్సహించాలన్నారు. ప్రైవేటుతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఎంతో మెరుగుపడిందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అనేక మంది ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారని నేటి పరిస్థితుల్లో చదువుకున్న ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించడం కష్టమని చక్కని ప్రతిభ ఉంటే ప్రైవేటు రంగంలోనూ నాలుగింతలు ఎక్కువ వేతనంతో కూడిన ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలు అందేలా సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు. పలువురు విద్యార్థినిలకు సైకిళ్లతో పాటు వివిధ పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అంతకుముందు విద్యార్థినిల ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అతనపు డీసీపీ జయరాం, ఈడ్బ్యువో రసూల్‌బీ, డీఈవో దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపు రాజకీయాలు మానుకోవాలి : ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

ఎడపల్లి, జనవరి 27: కాంగ్రెస్ నాయకులు బెదిరింపు రాజకీయాలు మానుకోవాలని ఎడపల్లి ఎంపీపీ శ్రీనివాస్ అన్నారు. శని వారం ఎడపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై అవిశ్వాసం పెడతామంటూ రెచ్చగొట్టే మాటలు కొందరు మాట్లాడుతున్నారని ఇది సిగ్గుచేటు అని అన్నారు. 11 మంది ఎంపీటీసీలు ఐక్యంగా ఉంటూ మండలానికి సేలందిస్తున్నామని ఆయన అన్నారు. మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ అమీర్, ఎమ్మెల్సీ కవిత ఆధ్వర్యంలో తాను ఎంపీపీగా ఎన్నికైన అని వారి మాటలు జవదాటలేనని అన్నారు. కొందరు మా పార్టీలో ఉన్న కోవర్టులు కాంగ్రెస్ నాయకులతో కుమ్మక్కై ఇదిగో అదిగో అవిశ్వాసం అని గందరగోళంకు తెరతీస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని బెదిరింపు రాజకీయాలు మానుకోవాలని అన్నారు. ఇప్పటికీ మేము ఐక్యంగానే ఉన్నామని ఎవరైనా కుట్రలు పన్నిన ఒరిగేదేంలేదని అన్నా రు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీటీసీలు బాబా, నాయుడు, స్రవంతి, మనీషారెడ్డి, పద్మ, ముత్తన్నవనజ, నాగరాజు తదితరులు ఉన్నారు.

చైర్మన్ పదవుల్లో 50 శాతం బీసీలను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీహరి

పెద్దబజార్, జనవరి 27: రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో 50 శాతం బీసీలను నియమించాలి తెలంగాణ బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శిసిర్పల్లి శ్రీహరి అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఒక బీసీ శాసనసభ్యుడిని కూడా గెలవనివ్వకుండా చేసిన అగ్రకులాల రాజకీయాలను ఖండిస్తున్నామన్నారు.మంత్రివర్గంలో కనీసం ఎనిమిది మంది బీసీలను మంత్రులుగా నియమించాలని అన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ రాష్ట్ర మంత్రిగా పార్లమెంట్ సభ్యుడిగా పనిచేసే నిజామాబాద్‌లో ఎఫ్ ఎం రేడియోస్టేషన్, పీఎఫ్ కార్యాలయంను ఏర్పాటు చేయించినతాండూర్ బాలాగౌడ్ కాంస్య విగ్రహాన్ని కామారెడ్డిజిల్లా కేంద్రంలో ఏర్పాటుచేయాలన్నారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నిరంజన్, విజయ్‌కుమార్, అరుణ్, దయానంద్,పాండు,భాస్కర్,పాల్గొన్నారు.

ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ వీక్షించిన కమ్మర్‌పల్లి మిసిమి విద్యార్థులు

కమ్మర్‌పల్లి, జనవరి 27: హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో భారత్ ఇంగ్లాండ్‌ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్ మూడోరోజు టెస్ట్‌మ్యాచ్‌ను కమ్మర్‌పల్లి మిసిమి ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు శనివారం వీక్షించారు. ఈ క్రికెట్ మ్యాచ్‌ను చూసి పాఠశాలల విద్యార్థులు సైతం క్రికెట్‌పై ఆసక్తిని పెంపొందించుకునే నిమిత్తం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఉచితంగా వీక్షించేందుకు వెసులుబాటు కల్పించడంతో మిసిమి పాఠశాలకు చెందిన 8, 9, 10, తరగతులకు చెందిన 42 మంది విద్యార్థులు, 9మంది ఉపాధ్యాయులకు అవకాశం లభించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ తెలిపారు. క్రికెట్‌ను ఉచితంగా వీక్షించడంతో పాటు ఉచిత భోజన వసతిఉలు కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు ఆనందోత్సవాల మధ్య మ్యాచ్‌ను వీక్షించినట్లు తెలిపారు.


ఉప్పల్ స్టేడియంలో తొలి టెస్ట్ మ్యాచ్‌ను వీక్షిస్తున్న విద్యార్థులు

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక


కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మానాల మోహన్‌రెడ్డి

నవీపేట, జనవరి 27: మండలంలోని మట్టయ్య ఫారం సర్పంచ్ రాము,అబ్బాపూర్(ఎం)సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ భూమయ్యలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా కేంద్రంలోని కాం గ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాలమోహన్ రెడ్డి సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చి తాము బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, పలువురు నాయకులు ఉన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

వర్ని, జనవరి 27: చందూర్ మండల కేంద్రంలో శనివారం నిరుపేదలకు దుప్పట్లను అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ని, చందూర్ వారు సంయుక్తంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్ర మంలో విండో చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, లయన్స్ సభ్యులు శివ నాగేశ్వర్‌రావు, రాంరెడ్డి, జయరామ్, సాయిలు, కొత్తపల్లి కృష్ణ పాల్గొన్నారు.

అవిశ్వాసం పై స్టే

డిచ్‌పల్లి, జనవరి 27:డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె భూమన్న పై ఎంపీటీసీ సభ్యులు పెట్టిన అవిశ్వాస తీర్మాణం ఈ నెల 29న జరగాల్సి ఉండగా కోర్టు ఆదేశాల మేరకు అవిశ్వాసం వాయిద వేసినట్లు ఆర్డీవో రాజేందర్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. అవిశ్వాసం పై ఎంపీపీ గద్దె భూమన్న న్యాయస్థానం ను ఆశ్రయించ డంతో హైకోర్టు ఈ మధ్యంతరఉత్తర్వులు ఇచ్చింది. దీంతో అవిశ్వాసం వాయిద పడింది.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పతాన్ని అలవర్చుకోవాలి


సిరికొండలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సిరికొండ జనవరి 27: విద్యార్థులు శాస్త్రీయ దృక్పతాన్ని అలవరుచుకోవడంతో పాటు సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు నర్సయ్య కోరారు. సిరికొండలో శనివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షను విద్యార్థులకు నిర్వహించారు.ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ సైన్స్ అధ్యాయాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులను కోరారు. సైన్స్ పట్ల ఆసక్తిని పెంచుకోవడం వల్ల శాస్త్రీయంగా ఆలోచన చేయడానికి వీలు కలుగుతుందన్నారు. సమాజంలో మూఢ నమ్మకాల నిర్మూలన చేయడానికి అవకాశాలు ఏర్పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రతినిధి సతీష్ ,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రీడా పరికరాల అందజేత


పోచంపాడ్‌లో విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేస్తున్న దృశ్యం

మెండోర, జనవరి27: మండలంలో పోచంపాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడాకారులకు క్రీడా పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మనపల్లి శ్రీనివాస్ జ్ఞాపకార్థం వారి మిత్రబృందం రామకృష్ణ, సందీప్, దేవేందర్, సాయినాథ్, అర్జున్, నితిన్‌లు క్రీడాకారులకు అవసరమైన క్రీడా పరికరాలు అందజేశారు. అనంతరం క్రీడా పరికరాలు అందజేసిన వారికి పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నిజాముద్దిన్, శుభసురేందర్, సుధాకర్, లలితకుమారి, తిరుమల గురువా, పీఈటీ భూపతి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు సహకరించాలి

బోధన్ రూరల్, జనవరి 27: బోధన్ పట్టణంలోని మారుతి మందిరం తూర్పు వైపు నూతన ద్వారం నిర్మాణానికై చేపడుతున్న నిర్మాణ పనులకు ప్రతి ఒక్కరు సహకరించాలని వేద పండితులు ప్రవీణ్ మహారాజ్ అన్నారు. శనివారం బోధన్ మారుతి మందిరంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హిందూ బంధువులు నిత్యం హనుమాన్ చాలీసా పారాయణంతో సకల శుభాలు కలుగుతాయన్నారు. శనివారం శివసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పసులోటి గోపికిషన్‌లతో పాటు పట్టణ ప్రముఖులు తదితరులు తమ సహాయ సహకారాలను అందించారు.

సీఎంకు ఉత్తరాలు రాసిన మగ్గిడి విద్యార్థులు


మగ్గిడిలోని పాఠశాలలో ఉత్తరాలు రాస్తున్న విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, జనవరి27: ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు పాఠశాల సమస్యలు, పరిసరాలపై సీఎంకు సామూహికంగా లేఖలు రాశారు. విద్యార్థుల్లో రైటింగ్ స్కిల్స్ పెంచడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు హెచ్ఎం హరిత తెలిపారు. పాఠశాలలో సమస్యలు, విద్యార్థులకు అవసరమైన పరికరాలు, ఇతర అంశాలపై ఉత్తరాలు రాసి పోస్ట్‌బాక్స్‌లో వేయించినట్లు ఆమె తెలిపారు. దీని ద్వారా విద్యార్థులు ఉత్తరాలు రాయడంలో అవగాహన ఏర్పడుతుందన్నారు.ఈకార్యక్రమంలో పీఈటీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపికైన మెండోర విద్యార్థులు

భీమ్‌గల్ రూరల్, జనవరి27: భీమ్‌గల్ మండలంలోని మెండోరా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతికి చెందిన గణేష్, సాయికుమార్ లు రాష్ట్రస్థాయి సైన్స్‌వేర్‌కు ఎంపిక కావడం జరిగిందని గైడ్ టీచర్ గంగమోహన్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించిన జిల్లాస్థాయి సైన్‌వేర్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరచారని తెలిపారు. విద్యార్థులను శనివారం గ్రామ సర్పంచ్ రాజేందర్, ఉపసర్పంచ్ జలెందర్, ప్రధానోపాధ్యాయుడు విజయ బాస్కర్ రెడ్డి, వీడీసీ ఛైర్మెన్ గంగారెడ్డి తదితరులు సన్మానించారు.

దత్తాపూర్‌లో దీర్ఘకాలిక వ్యాధుల సర్వే


దత్తాపూర్‌లో సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

డొంకేశ్వర్,జనవరి27:డొంకేశ్వర్ మండలం దత్తాపూర్, తొండాకూర్ గ్రామాల్లో ఆరోగ్యశాఖ సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధుల సర్వేను నిర్వహిస్తున్నారు. శనివారం గ్రామాలలో ఇంటింటికీ తిరుగుతూ షుగర్, బీపీ, థైరాయిడ్ వ్యాధులు ఉన్న వారిని గుర్తించి వారిని ప్రభుత్వం నుంచి వచ్చే మందులను ఉచితంగా అందిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే డబ్బులు అనవసరంగా ఖర్చు చేయకూడదని సూపర్‌వైజర్ అన్నారు. ప్రతీ వ్యాధికి డొంకేశ్వర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.ప్రజలలో ఆలోచనలు పెరిగి ఒత్తిడిలకు లోనైనా వ్యక్తు లకు దత్తాపూర్ ప్రైమరీ హెల్త్‌సెంటర్‌లో మెడిటేషన్ చేయిస్తున్నారు. బీపీ, షుగర్ ఉన్న వారికి ప్రతీరోజు పరీక్షలు నిర్వహిం చి మందులు పంపిణీ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేందర్, హెచ్‌సీ.సౌజన్య, ఎఎన్ఎంలు బి.సుమలత,ఎం.సుమలత, ఆశాలు, అనిత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి, క్రమశిక్షణ అవర్చుకోవాలి



పెట్రియాటిక్ రన్ నిర్వహిస్తున్న విద్యార్థులు

మాక్లూర్, జనవరి27: విద్యార్థులకు ముఖ్యంగా కావాల్సింది క్రమశిక్షణతో పాటు దేశభక్తి కలిగి ఉండాలని విజయ్ కళాశాలల చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మానిక్‌బండార్ గ్రామశివారులో గల విజయ్ ఇంజనీరింగ్ కళాశాలలో పెట్రియోటిక్ రన్ నిర్వహించారు. ఈసంద ర్భంగా నరేంధర్‌రెడ్డి మా ట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ స్వప్న, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.135	రూ.205	రూ. 225
వెన్‌కాబ్(కిలో)	: రూ.140	రూ.210	రూ. 230

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,300	రూ.59,300	రూ.755

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఫైటర్ (హిందీ 3డీ) (8.40, 12.15, 3.50, 7.25, 11.00)
స్క్రీన్-2 : హనుమాన్ (తెలుగు) (12.00, 3.20, 6.40, 10.00)
స్క్రీన్-3 : 105 (1.00)
: గుంటూరుకారం (3.40,10.10)
: నా సామిరంగ (7.00)
స్క్రీన్-4 : అయాలాన్ (తెలుగు) (12.50, 7.20)
: కెప్టెన్ మిల్లర్ (4.10, 10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కెప్టెన్ మిల్లర్ (10.30)
: హనుమాన్ (1.20, 4.25, 7.30, 10.30)
స్క్రీన్-2 : గుంటూరుకారం (1.10, 7.30)
: ఫైటర్ (హిందీ 3డీ) (4.20, 10.40)
స్క్రీన్-3 : హనుమాన్ (10.25, 7.40)
: కెప్టెన్ మిల్లర్ (1.30)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహోల్ : గుంటూరుకారం 11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఫైటర్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కెప్టెన్ మిల్లర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్